క్లుప్తంగా

సదుపాయాలు కల్పిస్తేనే ఆశీలు కడతాం

టెక్కలి రూరల్: టెక్కలి చిన్నబజార్‌లోని చేపల మార్కెట్‌లో ఆశీలు వసూలు చేసే వ్యక్తిపై చేపలు విక్రయించే మహిళలు బుధవారం తిరగబడ్డారు. పాత మార్కెట్‌కు రూపురేఖలు మార్చేసి ప్రారంభించారు. అయితే ఇక్కడ ఏర్పాటు చేసిన కుళాలు ద్వారా నీరు రావడం లేదని, విద్యుత్ సరఫరా లేకపోవడంతో లైట్లు సైతం వెలగడం లేదంటూ మహిళలు వాదించారు. తమకు పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పిస్తేనే పంచాయతీకి ఆశీలు చెల్లిస్తామని.. లేదంటే చెల్లించేదిలేదంటూ వాదించారు.

జిల్లాస్థాయి క్విజ్ పోటీ విజేతలు వీరే..



బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

వజ్రపుకొత్తూరు రూరల్: దేవి నవరాత్రుల సందర్భంగా డోకులపాడులో గంగాధర సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి క్విజ్ పోటీలలో గీతం స్కూల్ (హరిపురం) ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (హరిపురం), తృతీయ స్థానంలో జెడ్పీ ఉన్నత పాఠశాల (లోహరిబంద) నిలిచాయి. పోటీలలో 57 బృందాలు పాల్గొన్నాయి. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అంబికాదేవి సంఘం ఆర్థిక సాకారంతో బహుమతులు అందజేశారు.

మెగా జాబ్‌మేళా రేపు

సోంపేట: సోంపేట పట్టణంలోని కొంచాడ రాజేశ్వరరావు డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల 26వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.మణికుమార్ బుధవారం తెలిపారు. 11 కంపెనీల ప్రతినిధులు జాబ్‌మేళాకు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అక్రమ లేఅవుట్లు గుర్తించాలి



మాట్లాడుతున్న ఏవో రామారావు

ఇచ్ఛాపురం రూరల్: అక్రమ లే అవుట్లు గుర్తించి వాటిని క్రమబద్ధీకరించేందుకు చర్యలు తీసపుకోవాలని ఎంపీడీవో కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ కె.రామారావు అన్నారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బందితో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుడా లే అవుట్లకు సంబంధించి 2025 వరకు టౌన్ ప్లానింగ్ అధికారులకు దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉందన్నారు.

మహిళల ఆరోగ్యానికి రక్ష



రోగులను పరీక్షిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: ఆరోగ్యకరమైన మహిళలు, బలమైన కుటుంబాలుగా తీర్చిదిద్దేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ కృషి చేస్తున్నారని ఎంపీపీ బోర పుష్ప అన్నారు. అరకబద్రలో స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కళ్యాణీ వైద్య సేవలు అందిస్తూ మహిళల ఆరోగ్యపు అలవాట్లు, తీసుకోవాల్సిన ఆహారం గురించి అవగాహన కల్పించారు.

నేడు చంద్రమ్మ వర్ధంతి సభ

పలాస: కాశీబుగ్గ టి.కె.ఆర్ కల్యాణ మండపంలో గురువారం ఉదయం పది గంటలకు సిక్కోలు పోరాట యోధురాలు పైలా చంద్రమ్మ 5వ వర్ధంతి సభను నిర్వహిస్తున్నట్టు సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ బుధవారం తెలిపారు. సభలో న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, సీనియర్ జర్నలిస్టు పైలా అరుణ, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా అరుణోదయ కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.

ఆదిత్యలో పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో కళాశాల ప్రతినిధులు

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఎసెన్షియల్ ఇంగ్లిష్ పుస్తకాన్ని కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు ఆవిష్కరించారు. కళాశాలకు చెందిన అధ్యాపకులు ఎం.పాపినాయుడు, కె.ప్రకాశ్, ఎస్.శైలజ, కృష్ణప్రసాద్, పి.ప్రశాంతం, వి.షారన్ లూథర్, వి.రాంబాబు, కె.విజయలక్ష్మి, ఎం.జనార్దనరావు సంయుక్తంగా పుస్తకాన్ని రచించారు. ఇంజినీరింగ్ విద్యార్థులకు సులభ పద్ధతిలో ఇంగ్లిష్ పై పట్టు సాధించడానికి ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందని నాగేశ్వరరావు వెల్లడించారు. ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, హెచ్‌వోడీలు ఎం.రమణయ్య, రత్నమణి పాల్గొన్నారు.

జాతరో జాతర..!



విద్యుత్ కాంతులతో ధగధగ మెరుస్తున్న కొత్తమ్మతల్లి ఆలయ మార్గం (ఇన్‌సెట్లో) అమ్మవారి వేషధారణలో సాంస్కృతిక కార్యక్రమాలు

కోటబొమ్మాళిలోని కొత్తమ్మతల్లి శతాబ్ది ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా రెండోరోజైన బుధవారం నిర్వహించిన శోభాయాత్ర, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులకు కనువిందు చేశాయి. కళాకారుల నృత్యాలు, గ్రామీణ సాంస్కృతిక కళలు అలరించాయి. అరసవల్లి సూర్యనారాయణ, సింహాచలం వరహా నరసింహస్వామి, అన్నవరం సత్యనారాయణ స్వామి రథాలు ఆకట్టుకున్నాయి. వివిధ కళా ప్రదర్శనలు ఉత్సవానికి కొత్త శోభను తెచ్చాయి. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన హెలికాప్టర్ రైడ్‌కు ఔత్సాహికులు ఆసక్తి చూపారు. అలాగే విద్యుత్ వెలుగులతో కొత్తమ్మతల్లి ఆలయం నేత్రపర్వంగా మెరిసింది. –టెక్కలి



కొత్తమ్మతల్లిని దర్శించుకుంటున్న కోటబొమ్మాళి జెడ్పీటీసీ సభ్యుడు వెంకట్రావు, వైఎస్సార్‌సీపీ నాయకులు



డప్పు కళాకారుల ప్రదర్శన



మహిళల కోలాటం



హెలికాప్టర్ రైడ్

సీసీరోడ్డుపై ఇంటి నిర్మాణం

● జిల్లా కలెక్టర్, తహసీల్‌కు ఫిర్యాదు

సంతబొమ్మాళి: మలగాం పంచాయతీ బొడ్డువాని పేట గ్రామంలో సీసీ రోడ్డుపై ఇరువైపులా కొంత మంది ఇళ్ల నిర్మాణం చేపట్టారు. దీనిపై స్థానికులు జిల్లా కలెక్టర్, మండల తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన గోర్జంగి అప్పలస్వామి, ఆయన కుమారులు శివ, భాస్కరరావు కలిసి ప్రభుత్వ నిధులతో వేసిన సీసీ రోడ్డుపై గృహ నిర్మాణం చేపట్టారు. సీసీ రోడ్డుపై ఇంటి నిర్మాణంతో ఆగకుండా ఇంటిని నుంచి సైడు వాల్‌ను తారురోడ్డు ఆనుకొని నిర్మాణం చేపట్టడంతో స్థానికులు, ద్విచక్ర వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీనిపై గ్రామానికి చెందిన గొర్జంగి చెంచయ్య, అతని భార్య దాలమ్మ నిలదీయగా.. ఇంటి నిర్మాణదారులు వారిపై దాడి చేశారు. వారు అక్రమ నిర్మాణాలపై ఈనెల 22న కలెక్టరేట్‌లో జరిగిన స్పందనలో జిల్లా కలెక్టర్‌కు, బుధవారం స్థానిక తహసీల్దార్ హేమసుందర్‌రావుకు చెంచయ్య ఫిర్యాదు చేశారు. సీసీ రోడ్డుపై ఇంటి నిర్మాణం చేపట్టడంతో రాకపోకలు నిలిచి పోయాయని, వర్షపు, వాడిక నీటితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున సమస్యను పరిష్కరించాలని కోరారు.



సీసీ రోడ్డుపై ఇంటి నిర్మాణం చేపట్టిన దృశ్యం

జూన్ నాటికి టిడ్కో ఇళ్లు పూర్తి

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో వచ్చే ఏడాది జూన్ నాటికి టిడ్కో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తామని మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు చెప్పారు. తన కార్యాలయంలో బుధవారం పీఎంఏవై 2.0 ప్రధానమంత్రి ఆవాజ్ యోజన కార్యక్రమం కింద అంగీకార పోస్టర్లతో మహిళా సంఘ సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ. లక్షా 50 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ. ఒకలక్ష మంజూరు చేస్తుందన్నారు. అలాగే పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు భూమిని మంజూరు చేయనున్నట్టు పేర్కొన్నారు. స్థానికంగా స్థలం లభ్యం కాకపోతే ప్రభుత్వం వారే స్థలం కొనుగోలు చేసి ఇస్తారన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ సీఎల్‌టీసీ సీహెచ్ మల్లేశ్వరరావు, ఏపీ టిడ్కో సీఎల్‌టీసీ జగన్ పాల్గొన్నారు.



అంగీకార పత్రాలను చూపిస్తున్న కమిషనర్ రామారావు

పేదరిక నిర్మూలనే పీ4 లక్ష్యం

కంచిలి: పేదరిక నిర్మూలన లక్ష్యంగా పీ4 కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మండల ప్రత్యేకాధికారి డాక్టర్ కె.అప్పలస్వామి, ఎంపీడీవో వి.తిరుమలరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో అన్ని పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ప్రత్యేక శిక్షణను బుధవారం నిర్వహించారు. పీ4 విధివిధానలపై వివరించారు. నిబంధనల మేరకు బంగారు కుటుంబాలను గుర్తించాలన్నారు. ఏపీవో జి.ధనుంజయరావు, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

● మాజీ సీఎం జగన్‌ను కలిసిన తిలక్

మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ విజయవాడలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిపై అధినేతతో తిలక్ చర్చించారు. అలాగే జగన్‌మోహన్ రెడ్డితో జరిగిన సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. –టెక్కలి



సమావేశంలో శ్యాంప్రసాద్‌రెడ్డి



జగన్‌మోహన్‌రెడ్డితో తిలక్

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

ఇచ్ఛాపురం రూరల్: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను పట్ల ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని ఉద్యోగులు కోరారు. జేఏసీ పిలుపు మేరకు సచివాలయ ఉద్యోగులు బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఏవో కె.రామారావుకు వినతిపత్రం అందించారు. తమకు రావాల్సిన ఏరియాస్, నేషనల్ ఇంక్రిమెంట్లు వెంటనే ఇవ్వాలని, డోర్ టు డోర్ సర్వేలు రద్దు చేసి ఉద్యోగులకు సహకరించాలని కోరారు. సచివాలయ ఉద్యోగులకు పారదర్శక బదిలీలు నిర్వహించాలని, అన్ని డిపార్ట్‌మెంట్ వారికి జాబ్‌చార్ట్ తయారు చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వినత పత్రం అందించిన వారిలో జిల్లా సచివాలయ ఉద్యోగుల కోఆర్డినేటర్ పొల్లాయి అశోక్, సల్ల ప్రవీణ్, జోగమ్మ, ఉమా, పి.రమేష్, శేషారావు, శారద పాడీ, నిర్మల ఉన్నారు.



ఏవో రామారావుకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

యూరియా కోసం శాంతియుత నిరసన రేపు

కంచిలి: మండల రైతాంగం యూరియా కోసం పడుతున్న యాతనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ నెల 26వ తేదీన శాంతియుత నిరసన ధర్నా కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, వైఎస్సార్‌సీపీ నాయకుడు క్రిష్టారావు తెలిపారు. బుధవారం సాయంత్రం తన నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. నిరసన కార్యక్రమాన్ని కేవలం రైతుల సమస్యను పరిష్కరించాలని కోరుతూ చేపడుతున్నామని, దీనికి అన్ని గ్రామాల నుంచి రైతులు పాల్గొని తమ గొంతుకను ప్రభుత్వానికి వినిపించాలని పిలుపునిచ్చారు. రైతులంతా పార్టీలకతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న లోలాక్షి, క్రిష్టారావు

వీహెచ్‌ఏపై విచారణ

కవిటి: బొరివంక సచివాలయంలో ఉద్యానశాఖ సచివాలయ సహాయకురాలిగా పనిచేస్తున్న రత్నకుమారిపై రైతుల ఫిర్యాదు మేరకు బుధవారం విచారణ జరిగింది. టెక్కలి డివిజన్ ఏడీహెచ్ చంద్రశేఖర్, కవిటి హెచ్‌వో మాధవీలతకు రైతులు రత్నకుమారి పనితీరుపై ఇటీవల ఫిర్యాదు చేశారు. విధుల నిర్వహణలో సమయపాలన పాటించడం లేదని, రైతులకు అందిస్తున్న సేవల్లో తీవ్రనిర్లక్ష్యం చూపిస్తున్నారని విచారణ అధికారులకు రైతులు వివరించారు. రైతులు వెల్లడించిన ఫిర్యాదు వివరాలను వారు నమోదుచేసి ఉన్నతాధికారులకు నివేదించనున్నట్టు ఏడీహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. సర్పంచ్ బి.శ్రీరాం ప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు సతీష్ ఉన్నారు.



రైతుల సమక్షంలో విచారణ చేస్తున్న అధికారులు

కొత్త జిల్లాతోనే 'ఉద్దానం' అభివృద్ధి

● శాసన మండలిలో ఎమ్మెల్సీ రామారావు

కవిటి: ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాలు రాష్ట్రానికి దూరంగా ఉండడంతో అభివృద్ధి ఫలాలు ఇక్కడ ప్రజలకు నేటికీ అందని ద్రాక్షగానే మిగిలిపోతున్నాయని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. బుధవారం శాసన మండలిలో ఈ మేరకు ఆయన ప్రభుత్వానికి స్థానికుల అభిప్రాయాన్ని నివేదించారు. ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి ఫలాలు సక్రమంగా తమకు అందడం లేదని, ఈ రెండు పట్టణాలలో ఏదో ఒకదాన్ని కొత్త జిల్లాగా ఏర్పాటు చేస్తే అభివృద్ధి అవకాశాలు మెండుగా ఉంటాయని అభిప్రాయపడ్డారు. ఇచ్ఛాపురం నియోజకవర్గం శ్రీకాకుళం జిల్లా కేంద్రానికి 140 కిలోమీటర్ల దూరంలో ఉందన్నారు. వివిధ పనుల మీద జిల్లా కేంద్రానికి పౌరులు చేరాలంటే చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోందని చెప్పారు. ముఖ్యంగా ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ వ్యాధుల సమస్య తీవ్రంగా ఉంది, ఇటీవల కాలంలో క్యాన్సర్ వ్యాధులు కూడా చాపకింద నీరులా వ్యాప్తి చెందుతున్నందున వైద్యం కోసం నియోజకవర్గం నుంచి రోగులు చాలా దూరం ప్రయాణించాల్సి వస్తోందని అన్నారు జిల్లా, మండలాల సరిహద్దుల పునర్విభజన చేసే ఆలోచన కూటమి ప్రభుత్వానికి ఉన్న నేపథ్యంలో రాష్ట్రానికి చిట్టచివరిగా ఉన్న ఇచ్ఛాపురం లేదా పలాసను జిల్లా కేంద్రంగా గుర్తించాలంటూ ప్రభుత్వం దృష్టికి సభ ద్వారా తీసుకువెళ్లారు. ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు ఈ నిర్ణయం ద్వారా పరిష్కారం లభించనుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఉద్దానం అనే పేరుతో కొత్త జిల్లాను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

వ్యవస్థలన్నీ బలోపేతం అవుతాయి

పలాస–ఇచ్ఛాపురం ప్రాంతాలను కలుపుతూ జిల్లా ఏర్పాటు చేస్తే అన్ని ప్రభుత్వ విభాగాలు బలోపేతం జరిగే అవకాశాలు ఉన్నాయని ఎమ్మెల్సీ అభిప్రాయపడ్డారు. నూతన జిల్లా ఏర్పాటుకు సంబంధించి మండలి ప్రాంగణంలో మీడియా పాయింట్‌లో మాట్లాడారు. వెనుకబడిన ఇచ్ఛాపురం నియోజకవర్గం తలసరి ఆదాయం రూ. 46 వేలు మాత్రమే అనే విషయాన్ని అధికారులు గుర్తించాలని కోరారు. జిల్లా కేంద్రంగా ఈ ప్రాంతం ఏర్పడితే వైద్య, విద్య, పరిపాలన విభాగాలు బలోపేతం అవుతాయని, స్థానికంగా నిరుద్యోగులకు ఎన్నో అభివద్ధి అవకాశాలు ఏర్పడతాయని అన్నారు.



శాసనమండలిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

ఇరువర్గాలపై కేసు నమోదు

నందిగాం: ఆనందపురం గ్రామానికి చెందిన ఇరువర్గాల కొట్లాట ఘటనలో పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ జిన్నారావు తెలిపారు. బగాది రామలక్ష్మి, తమ్మినాన మాదయ్య మధ్య సాగునీటి కోసం ఈ నెల 22వ తేదీన తగాదా జరిగింది. దీనిపై బుధవారం మాదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామలక్ష్మి, భీష్మారావు, హేమాచలంపై, అలాగే రామలక్ష్మి ఫిర్యాదు మేరకు మాదయ్యపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు పేర్కొన్నారు.

చీడ పీడలకు నివారణ చర్యలు



ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

సోంపేట: వరిపైరులో చీడపీడల నివారణకు చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు భవానీశంకరరావు, వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి రైతులకు సూచించారు. బారువ గ్రామంలో వరి పొలాలను బుధవారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. భూసార ఫలితాల ప్రకారం సూచించిన ఎరువులు వాడాలన్నారు. అనంతరం సోంపేటలో యూరియా పంపిణీ నిర్వహిస్తున్న ప్రైవేటు దుకాణాన్ని పరిశీలించారు.

శాస్త్రోక్తంగా గజ్జల పూజ

కవిటి: ముత్యాలపేటలోని అమృత వర్షిణీ సహిత మృత్యుంజయేశ్వర స్వామి ఆలయంలో శాస్త్రీయ నృత్యప్రదర్శన శిక్షణలో ఆసక్తి కలిగిన బాలబాలికలకు బుధవారం గజ్జల పూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కేంద్రంలో పలువురు చిన్నారులు కొత్తగా భరతనాట్యం, కూచిపూడి తదితర నృత్యాలలో శిక్షణ ఇచ్చేందుకు ఆలయ ధర్మకర్త పాతిన చంద్రశేఖరం ఏర్పాటు చేశారు. ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమి ఆధ్వర్యంలో ఏడాదిగా ఇక్కడ సుమారు 50 మంది చిన్నారులకు నాట్యంలో శిక్షణ ఇస్తున్నారు. తాజాగా 11 మంది చిన్నారులకు గజ్జల పూజను ఆలయంలో చిన్నా గురుస్వామి నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పాతిన చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా డిగ్రీ విద్యార్థుల ఫ్రెషర్స్‌డే వేడుకలు



పలాస: పాటకు డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు



కవిటి: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సింహాచలంనాయుడు

పలాస: పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థులకు ఆప్యాయతతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. సినీ, శాస్త్రీయ, జానపద పాటలకు విద్యార్థులు ఉత్సాహంగా డ్యాన్స్ చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని ఆకాంక్షించారు. పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఆధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

కవిటి: తల్లిదండ్రుల ఆకాంక్షలను నిజం చేస్తూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించాలని కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కొట్టుగుల్లి సింహాచలంనాయుడు అన్నారు. కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

ఘనంగా ఎన్ఎస్ఎస్ డే



కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ 57వ ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రోగ్రాం అధికారులు పాపారావు, విష్ణుమూర్తి ఆధ్వర్యంలో వలంటీర్లు ఎన్ఎస్ఎస్ అక్షర ఆకృతిలో కూర్చొని అలరించారు. జాతీయ సేవా పథకం ఉద్దేశాన్ని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సింహాచలంనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు. –కవిటి

ఆరోగ్యంపై దృష్టిపెట్టాలి



డ్రగ్స్, గంజాయి వినియోగం వలన ఆరోగ్యానికి చేటని కంచిలి ఎంపీడీవో వి.తిరుమలరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సచివాలయ సిబ్బందితో శ్రీకాకుళం ఈగల్ టీమ్ డ్రగ్స్, గంజాయిపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. డ్రగ్స్ వలన ఆరోగ్యానికి కలిగే హానికర ప్రభావాలు, ఎన్‌డీపీఎస్ చట్టం కింద వచ్చే శిక్షలు, డ్రగ్స్ నుంచి దూరంగా ఉండటం వలన భవిష్యత్తు సురక్షితం అవుతుందని వివరించారు. డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదాన్ని సిబ్బందిలో ప్రోత్సహిస్తూ, డ్రగ్స్‌ను తిరస్కరించాలి, భవిష్యత్ కాపాడుకోవాలని ఈగల్ టీమ్ ప్రతినిధి సంతోష్ కోరారు. డ్రగ్స్ సంబంధిత సమాచారం లేదా ఫిర్యాదుల కోసం టోల్–ఫ్రీ నంబర్ 1972ను సంప్రదించాలని కోరారు. ఎక్సైజ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. –కంచిలి

పీ-4 లక్ష్యాలు నెరవేర్చాలి



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీ–4 లక్ష్యాలను నెరవేర్చాలని పలాస–కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులకు పీ–4 మున్సిపల్ లెవల్ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించామన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 989 బంగారు కుటుంబాలను సర్వే చేసినట్టు వివరించారు. ఉద్యోలందరూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పని చేయాలన్నారు. మాస్టర్ ట్రైనర్లు, మున్సిపల్ సచివాలయాల కార్యదర్శులు, నియోజకవర్గ యాక్షన్ ప్లాన్ సభ్యులు పాల్గొన్నారు. –పలాస